సాక్షి
నిజామాబాద్

గురువారం । 5, అక్టోబర్ । 2023

I



రైలుపట్టాలపై కన్నీటి కథలు
రైలుపట్టాలపై మృతి చెందినవారి ఆధారాలు లభించకపోతే పోలీసులే ఖననం చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు చివరిచూపు దక్కడం లేదు.
- IIలో ▸



ఐదులక్షలు మాయం
డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన పుండ్రు రాజేందర్ బ్యాంకుఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.5లక్షలు మాయం చేశారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.3 /20.5
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బతుకమ్మ చీరల పంపిణీ షురూ

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభమైంది. బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు బుధవారం చీరలను పంపిణీ చేశారు. జిల్లాకు 6,33,116 చీరలు అవసరం కాగా, ఇప్పటి వరకు 4.17లక్షలు వచ్చాయి. మండలాలకు సరఫరా చేసిన చీరలను రేషన్‌కార్డులో పేరుండి 18 సంవత్సరాలు నిండిన మహిళలకు అందజేయనున్నారు. ఇప్పటి వరకు 15వేల వరకు చీరలు పంపిణీ చేయగా, గురువారం నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు అందజేయనున్నారు. చీరల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది.

'రామడుగు'లో కలపొద్దని వినతి



సుభాష్‌నగర్: తమ గ్రామాన్ని నూతనంగా ఏర్పడిన రామడుగు మండలంలో కలపొద్దని కోరుతూ మైలారం గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు, గ్రామస్తులు మాట్లాడుతూ.. మైలారం గ్రామాన్ని ధర్పల్లి మండలంలోనే కొనసాగించాలని డిమాండ్‌చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఇష్టానుసారంగా గ్రామాన్ని రామడుగు మండలంలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. వెంటనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అప్పటివరకు ధర్పల్లి మండలంలోనే మైలారం గ్రామాన్ని కొనసాగించాలన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నిజామాబాద్‌నాగారం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారు లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధికారులను ఆదేశించారు. వైస్ చైర్‌పర్సన్ రజితాఎల్లయ్యయాదవ్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని జడ్పీలో బుధవారం నిర్వహించారు. ఆయాశాఖల పనుల పురోగతి వివరాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని మైన్స్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సభ్యులు మాన్‌సింగ్, మోర్తాడ్ రవి, సుమలత, డిప్యూటీ సీఈవో సుందరవరదరాజన్, సంజీవ్, డీపీఓ జయసుధ, మైన్స్‌ఏడీ సత్యనారాయణ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వే, హైవేస్‌కు ప్రాధాన్యత



సుభాష్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ముఖ్యంగా రైల్వే, నేషనల్ హైవే ప్రాజెక్టులకు అధికప్రాధాన్యతనివ్వడంతోపాటు రైతాంగానికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఇందూరు జనగర్జనసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానిపై మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి అవాకులుచవాకులు పేలుస్తున్నారని విమర్శించారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రధానిని విమర్శించే అర్హత లేదన్నారు. మోదీ పసుపుబోర్డును ప్రకటించి దశాబ్దాల కలను నెరవేర్చారని, రైతాంగం ఆయనకు రుణపడి ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు స్వామియాదవ్, నారాయణయాదవ్, యెండల సుధాకర్, భరత్‌భూషణ్, నరేందర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బరిలో అన్నపూర్ణమ్మ

జిల్లాలోని ఐదు శాసనసభ స్థానాల్లో నాలుగు స్థానాలకు అభ్యర్థులను బీజేపీ మొదటి జాబితాలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. బాల్కొండ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ మంత్రి ప్రశాంత్‌రెడ్డి టార్గెట్‌గా మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మను ఫైనల్ చేసినట్లు సమాచారం. విలువలు కలిగిన రాజకీయనేతగా ఆమెకు పేరుంది. బోధన్‌లో ఇద్దరు పోటీ పడుతుండగా, మరో మూడు నియోజకవర్గాల్లో ఒక్కొక్కరి పేర్లే వినిపిస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్


అన్నపూర్ణమ్మ


ధన్‌పాల్


మోహన్‌రెడ్డి


పైడి రాకేశ్‌రెడ్డి


ప్రకాశ్‌రెడ్డి


దినేశ్

- నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్
- ఆర్మూర్ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి
- నిజామాబాద్ రూరల్‌కు కులాచారి దినేశ్
- బోధన్ నుంచి మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిల్లో ఒకరికి అవకాశం
- అధిష్టానం పెద్దల నుంచి గ్రీన్‌సిగ్నల్ పొందిన ఎంపీ అర్వింద్!

శాసనసభ ఎన్నికల కోడ్ సమీపిస్తున్న తరుణంలో బీజేపీలో టిక్కెట్ల ప్రకటనకు రంగం సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని ఐదు శాసనసభ స్థానాల్లో నాలుగు స్థానాలకు సంబంధించి అభ్యర్థులను మొదటి జాబితాలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. పసుపు రైతులు అధికంగా ఉన్న బాల్కొండ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మను బరిలోకి దించేందుకు నిర్ణయం ఖరారైనట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఎంపీ ధర్మపురి అర్వింద్ అధిష్టానం పెద్దలతో మాట్లాడి అన్నపూర్ణమ్మ పేరును ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. బాల్కొండ నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి ప్రశాంత్‌రెడ్డి టార్గెట్‌గా ఎంపీ అర్వింద్ అన్నపూర్ణమ్మను రంగంలోకి దింపుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన అన్నపూర్ణమ్మ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో జిల్లాలో గట్టి పట్టు సంపాదించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసిన అన్నపూర్ణమ్మ లాంటి నాయకురాలిని బరిలోకి దించితే రైతులు, మహిళలు, యువకుల నుంచి తిరుగులేని సహకారం లభిస్తుందనే ఉద్దేశంలో ఎంపీ అర్వింద్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. దీంతో బాల్కొండ స్థానంలో త్రిముఖ పోటీ జరుగనుంది.

- నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణకు టిక్కెట్టు ఖరారు అయినట్లు తెలుస్తోంది. 2018 ఎన్నికల సమయంలో ధన్‌పాల్ సూర్యనారాయణకు చివరి నిముషంలో టిక్కెట్టు చేజారిపోయింది. ఈసారి మాత్రం తొలి జాబితాలోనే ధన్‌పాల్ టిక్కెట్టు ప్రకటించనున్నట్లు సమాచారం.
- నిజామాబాద్ రూరల్ నుంచి డిచ్‌పల్లి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కులాచారి దినేశ్‌కు ఆర్మూర్ నియోజకవర్గం టిక్కెట్టును అంకాపూర్‌కు చెందిన బడా వ్యాపారి పైడి రాకేశ్‌రెడ్డికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ నాలుగు టిక్కెట్లను మొదటి జాబితాలోనే ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అర్వింద్ ఇప్పటికే ఈ విషయమై కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ పొందినట్లు తెలుస్తోంది.
- బోధన్ టిక్కెట్టు విషయంలో మాత్రం మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిల మధ్య పోటీ ఉంది. ఈ నేపథ్యంలో ఈ టిక్కెట్టు విషయంలో వివిధ అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. మేడపాటి ప్రకాశ్‌రెడ్డి వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎంపీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న మేడపాటికి మంచి పేరుంది. ఈ నెల 7న ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడపల్లిలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాలు సైతం చురుగ్గా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని 6,500 మంది పార్టీ కార్యకర్తలందరికీ బీమా సౌకర్యం సైతం సొంత ఖర్చుతో మేడపాటి కల్పించారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేశారంటూ మేడపాటి పెద్ద ఎత్తున పోరాటం చేశారు. దీంతో అధికారులు సదరు ఓట్లను గుర్తించి తొలగించారు. ఈ నేపథ్యంలో మేడపాటి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా గెలుపొందిన ధర్మపురి అర్వింద్ ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు సాధించడంతో బీజేపీ టిక్కెట్లకు డిమాండ్ పెరిగింది. తాజాగా టిక్కెట్ల ఖరారుపై పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా ఓటర్లే అధికం

- తుదిజాబితా విడుదల
- మొత్తం ఓటర్లు 13,65,811
- పెరిగిన ఓటర్ల సంఖ్య 44,721
- పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 71,454 ఎక్కువ
- దరఖాస్తులు : 66,435
  తిరస్కరణ : 21,714

సుభాష్‌నగర్: జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో రాజకీయాలను అతివలే ప్రభావితం చేయనున్నారు! పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లు 71,454 అధికంగా ఉన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. రాజకీయ పార్టీల అభ్యర్థులు సైతం మహిళా ఓట్లను పక్కాగా పరిగణిస్తారు. వారి ఓట్లు ఏ పార్టీకి పడితే ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్లే అని పలు రాజకీయ పార్టీల నాయకులు భావిస్తున్నారు. పురుషుల కంటే అధికంగా బాల్కొండలో 16,170, రూరల్‌లో 16,160, ఆర్మూర్‌లో 13,529, బోధన్‌లో 8,804, అర్బన్‌లో 8,408, బాన్సువాడలో 8,383 ఓట్లు మహిళలవే ఉన్నాయి.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం బుధవారం తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 13,65,811 (ఎన్‌ఆర్‌ఐ ఓట్లతో సహా) మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 71,454 మంది మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆగస్టు 21న ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 19వ వరకు ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు, ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ కొనసాగింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి. స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్‌ఎస్‌ఆర్)-2023 ప్రణాళిక ప్రకారం అధికారులు ఓటరు జాబితాను పకడ్బందీగా తయారుచేశారు. బోగస్ ఓటర్లపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

జిల్లావ్యాప్తంగా 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తుది ఓటరు జాబితా ప్రకారం మొత్తం 13,65,811 మంది ఓటర్లుండగా, 6,47,149 మంది పురుషులు, 7,18,603 మహిళలు, 59 మంది ఇతరులు ఉన్నారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు ఫారం 6, 7, 8 ద్వారా 66,435 మంది దరఖాస్తు చేసుకోగా, 21,714 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ముసాయిదా జాబితాకంటే 44,721 ఓట్లు అధికంగా నమోదయ్యాయి. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించారు.

44,721 ఓట్లు అధికంగా నమోదు

ఆగస్టు 21న ప్రకటించిన ముసాయిదా జాబితా కంటే తుదిజాబితాలో 44,721 ఓట్లు అధి కంగా నమోదయ్యాయి. అత్యధికంగా నిజామాబా ద్ అర్బన్‌లో 13,394 ఓట్లు నమోదుకాగా, ఆర్మూర్ లో 4491, బోధన్‌లో 8,037, బాన్సువాడలో 5,372, రూరల్‌లో 7,218, బాల్కొండలో 7,209 ఓట్లు నమోదయ్యాయి. అధికంగా యువఓటర్లే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఆర్మూర్	217	96,404	1,09,933	7	2,06,344
బోధన్	246	1,03,577	1,12,381	5	2,15,963
బాన్సువాడ	258	92,225	1,00,608	8	1,92,841
నిజామాబాద్‌అర్బన్	289	1,39,163	1,47,571	32	2,86,766
నిజామాబాద్ రూరల్	293	1,16,052	1,32,212	5	2,48,269
బాల్కొండ	246	99,728	1,15,898	2	2,15,628
మొత్తం	1,549	6,47,149	7,18,603	59	13,65,811

లక్ష మెజారిటీ ఇవ్వాలె


సభలో ప్రసంగిస్తున్న మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

- బాన్సువాడలోనే కాదు.. జుక్కల్, ఎల్లారెడ్డిలోనూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి
- పార్టీ శ్రేణులతో మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు దక్కనీయొద్దని పిలుపు

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ/నిజాంసాగర్: బాన్సువాడను రూ. పదివేల కోట్లతో అభివృద్ధి చేసిన లక్ష్మీపుత్రుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఈసారి లక్ష మెజారిటీతో గెలిపించాలని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాన్సువాడతోపాటు అటు ఎల్లారెడ్డి, ఇటు జుక్కల్ నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. తెలంగాణను ఆగం జేసిన కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు దక్కకుండా చూడాలన్నారు. బుధవారం బాన్సువాడలో రూ.85 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ భవనం, మల్టీ జనరేషన్, చిల్డ్రన్స్ పార్కులు, ట్రాఫిక్ సిగ్నల్, బల్దియా కార్యాలయం, సమీకృత రెవెన్యూ కార్యాలయాలు ప్రారంభించారు. ఆధునిక ధోబీ ఘాట్‌తోపాటు ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వీక్లీమార్కెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. బాన్సువాడలో 11 వేల డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించారన్నారు. ఒక్కో ఇంటికి రూ.5.40 లక్షలు ఇచ్చామని, కాంగ్రెస్ పాలనలో రూ.70 వేలు మాత్రమే ఇచ్చేవారని పేర్కొన్నారు. గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదని, ఇప్పుడు 24 గంటల కరెంటు ఇస్తున్నామని పేర్కొన్నారు. పుట్లకొద్ది పంట పండుతుంటే ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తప్పుడు కూతలు కూస్తున్నారని విమర్శించారు. అప్పుడు విత్తనాలు, ఎరువుల కోసం చెప్పులు లైన్లలో పెట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. మద్దతు ధర కూడా దొరికేది కాదన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. అప్పట్లో తాగునీటికి కూడా ఎన్నో కష్టాలు ఉండేవని, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరందుతోందని పేర్కొన్నారు. కరువుతో నిజాంసాగర్ నిండక రైతులు ఎన్నో కష్టాలు పడేవారన్నారు. కేసీఆర్ నిజాంసాగర్‌కు మల్లన్నసాగర్ ద్వారా నీటిని తీసుకువచ్చి కరువును కూడా పారదోలిన విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. 24 గంటల కరెంటు ఇస్తుంటే, మూడు గంటలు చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నాడని, మూడు గంటలే సరిపోతదని అనేవాళ్లు కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని సూచించారు. రైతుబంధువుగా పోచారం, కేసీఆర్‌లు నిలిస్తే, రాబందుగా రేవంత్‌రెడ్డి ఉన్నాడని, ఏ గట్టున ఉంటారో ఆలోచించుకోవాలని కోరారు. ఎన్నికలు రావడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు దోచుకున్న పైసలు ఇచ్చి ఓటు కోసం ప్రమాణం చేయమంటారని, పైసలు తీసుకుని తూచ్ అనాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్‌చారి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, దఫేదార్ రాజు, పోచారం శంభురెడ్డి, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, శ్రీధర్, మోహన్ నాయక్, పోచారం రవీందర్‌రెడ్డి, రఘు, స్వరూప, పద్మ, నీరజా వెంకట్‌రాంరెడ్డి, పాత బాలకృష్ణ, అనిత, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో సరదాగా కేటీఆర్



నస్రుల్లాబాద్: బాన్సువాడలో చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్.. చిన్నారులతో సరదాగా గడిపారు. పిల్లలను పరిచయం చేసుకున్నారు. తమకోసం పార్కును ఏర్పాటు చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పిల్లలతో కృతజ్ఞతలు చెప్పించారు.

కౌన్సిల్‌లో 59 అంశాలకు ఆమోదం

- నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బిగాల
- కబ్జాలపై నిలదీసిన విపక్షాలు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిగాల, కమిషనర్ మకరంద్, కార్పొరేటర్లు, అధికారులు


మేయర్ దండు నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని నూతన కార్పొరేషన్‌భవన్‌లో కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, డిప్యూటీ మేయర్ ఇద్రీస్‌ఖాన్, కమిషనర్ మంద మకరంద్ హాజరయ్యారు. మొత్తం 60అంశాలపై చర్చించిన కౌన్సిల్, 59అంశాలకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు పలు అంశాలపై నిలదీశారు. కౌన్సిల్‌లో సమస్యలను ప్రస్తావిస్తే జవాబు చెప్పడం లేదని మండిపడ్డారు. కబ్జాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాకు ఎప్పటికీ రుణపడి ఉంటామని సుమారు పదేళ్లుగా నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. గతంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారని, ప్రతి ప్రాంతానికి నీటి వసతి కల్పించడంతోపాటు ప్రతి డివిజన్‌లో ఒక పార్కు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ఐటీ హబ్ ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశారన్నారు. సమీకృత మార్కెట్‌యార్డు, వైకుంఠధామాల నిర్మాణంతోపాటు బొడ్డెమ్మ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారని అన్నారు.

ప్రశ్నిస్తే జవాబులు చెప్పరు

కౌన్సిల్‌లో సమస్యలను ప్రస్తావిస్తే వినడం తప్ప సమాధానం చెప్పడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులను ఎందుకు కొనసాగిస్తున్నారని కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో పదేపదే ప్రశ్నించాం. రిటైర్డ్ ఉద్యోగి రషీద్‌లాంటి వాళ్లు మున్సిపల్‌లో ఉండాల్సిందేనని, అవసరమైతే తానే జీతాలు ఇస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అనుభవం ఉన్నవారితో కొత్తవారికి శిక్షణ ఇప్పించాలని అడిగినా.. కుదరదు అని అంటున్నారు. సీఎం కేసీఆర్ ఏడాది క్రితం రూ.100కోట్లు ఇస్తే ఇప్పుడు శంకుస్థాపనలు చేస్తున్నారు. కేటీఆర్ రూ.60కోట్లు ఇచ్చారు. మరోరెండుమూడు రోజుల్లో ఎలక్షన్ కోడ్ వచ్చే పరిస్థితి ఉంది. డివిజన్లలో సమస్యలు అలాగే ఉన్నాయి. అనుభవం, అర్హత లేకున్నా కార్మికులను జవాన్లుగా, జవాన్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా అప్పటి కమిషనర్ చిత్రామిశ్రా నియమించారు.

– స్రవంతిరెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్

కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

టౌన్‌ప్లానింగ్, రెవెన్యూకు సంబంధించిన మ్యుటేషన్‌ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. నగరంలో చాలా చోట్ల కబ్జాలు జరుగుతున్నాయి. నాగారంలోని భారతీకాలనీలో శ్మశానవాటిక కబ్జాకు గురవుతున్నది. ఎల్‌ఈడీలైట్లు సరఫరా కావడం లేదని బిల్లులు ఇవ్వడం లేదు. శానిటేషన్‌లో ఎవరైనా చనిపోతే వెంటనే కార్మికులను భర్తీ చేయాలి. కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలు పెంచాలి.

– న్యాలం రాజు, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

రాష్ట్రంలోనే ఎత్తైన రథం

- ఏగిస కలపతో రూపుదిద్దుకున్న నీలకంఠేశ్వరాలయ రథం
- ఎత్తు 28 ఫీట్లు.. వెడల్పు 11 ఫీట్లు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయ రథం సిద్ధమైంది. గతంలోని రథం శిథిలావస్థకు చేరడంతో, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత సంవత్సరం నుంచి రూ.50లక్షల వరకు విరాళాలు సేకరించి నూతన రథాన్ని తయారుచేయించారు. గద్వాల జిల్లా పెంట్లవెల్లికి చెందిన శిల్పి బైరోజు బాలబ్రహ్మాచారి చేతుల్లో రథం రూపుదిద్దుకున్నది. మహారాష్ట్రలోని అడవుల నుంచి సేకరించిన పెద్దఏగిస కలపను రథం తయారీకి ఉపయోగించారు. ఈ కలప జీవితకాలం వెయ్యి సంవత్సరాలు. రథం వివిధ భాగాలు గద్వాల జిల్లాలో తయారు కాగా, వాటిని ఇక్కడకు తీసుకువచ్చి అమర్చి మిగతా పనులను స్థానికంగా పూర్తి చేశారు. రథంపై కర్రతోనే దేవుళ్ల చిత్రపటాలు, ఏనుగులు, గుర్రాల బొమ్మలను చెక్కించారు. రథం ఎత్తు 28 ఫీట్లుకాగా, 11 ఫీట్ల వెడల్పుతో తయారు చేశారు. ఇది రాష్ట్రంలోనే ఎత్తైన రథంగా గుర్తింపుపొందింది.


గ్రానైట్‌తో చక్రాలు

హంపీ ఆలయానికి వినియోగించిన గ్రానైట్‌తో రథ చక్రాలను కర్నూల్ జిల్లా ఆలూర్‌లో తయారు చేయించారు. ఒక్కో చక్రం బరువు ఒక టన్ను బరువు ఉంటుంది.


నీలకంఠేశ్వరాలయ రథం

రైలు పట్టాలపై కన్నీటి కథలు

- మృతుల ఆధారాలు భద్రం
- అనాథ శవాలు ఎన్నో..



ఖలీల్‌వాడి: బతుకు దెరువు కోసం కొంత మంది, స్వస్థలాలకు చేరుకునేందుకు కొంత మంది రైళ్లో ప్రయాణం చేస్తుంటారు. వీరిలో ప్రమాదవశాత్తు కాలుజారి, ఇతర కారణాలతో రైలు పట్టాలపై మృతి చెందిన ఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయి. ఆధారాలు ఉన్న వారి మృతదేహాలను రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగిస్తుండగా.. ఆధారాలు లేని వారి శవాలను రెండు రోజులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచి ఆ తర్వాత ఖననం చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులకు చివరి చూపుకూడా దగ్గకుండా పోతోంది.

ఎక్కడి నుంచో వచ్చి..

దూర ప్రాంతాలకు వెళ్లే వారు రైలులో ప్రయాణించి పడి మృతి చెందిన వారే ఎక్కువ మంది ఉంటున్నారు. వేగంగా ప్రయాణిస్తున్న రైలు నుంచి పడినప్పుడు శరీరంపై బట్టలు కూడా ఉండవు, దస్తులు గుర్తు పట్టకుండా ఉండిపోతున్నాయి. దీంతో వారి శరీర భాగాలు మాత్రమే లభిస్తాయి. కొన్ని సార్లు తలభాగం గుర్తు పట్టనంతగా మారిపోతంది. అంతేకాకుండా మృతి చెందిన వారి కుటుంబసభ్యుల్లో ఎక్కువ మంది నిర్లక్ష్యరాసులై ఉంటారు. దీంతో ఏ రైలులో ప్రయాణం చేశారో తెలియక కూడా వారు గుర్తించకుండా ఉన్న ఘటనలు ఉన్నాయి. దీంతో ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారు అన్ని పీఎస్‌లలో వాకబు చేయడం కష్టమవుతోంది. కొందరు అవగాహన లోపంతో మృతి చెందిన వ్యక్తి గురించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఊరుకుంటున్నారు.

ఇటీవల నగరంలోని దుబ్బ ప్రాంతంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ప్రశాంత్(32) అప్పుల బాధ భరించలేక నిజామాబాద్, ఆర్మూర్ మధ్య ఉన్న రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రశాంత్ గాజుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు ఎస్సై తావూ నాయక్ తెలిపారు. ఆధారాలు లభించడంతో కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అందజేశారు.

ఆగస్టు12న నిజామాబాద్, డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ మధ్యలో ప్రమాదవశాత్తు నడుస్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి(30) పడి మృతి చెందారు. ఈ ఘటన ధర్మారంలో చోటు చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని ఆధారాలను అధికారులు భద్రపరిచారు.

సంవత్సరం	రైల్వేపట్టాలపై మృతుల సంఖ్య	గుర్తించిన మృతుల సంఖ్య	గుర్తించని మృతుల సంఖ్య
2021	85	61	24
2022	97	60	37
2023	103	82	21(జనవరి నుంచి ఆగస్టు)

అనాథ శవాల దహనం

రైలు పట్టాలపై ఉన్న అనాథ శవాలను పోస్టుమార్టం చేసిన తర్వాత జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు, మూడు రోజులు ఉంచిన తర్వాత వాటిని ఖననం చేస్తారు. ఒకవేళ కుటుంబసభ్యులు వచ్చి రైల్వే పోలీసులను అడిగితే ఫొటోలు, ఆధారాలను చూపిస్తారు. గతంలో మృతదేహాలను ఖననం చేసేవారు. అవసరమైతే వెలికితీసి రీ పోస్టుమార్టం చేయడానికి వీలు ఉండేది. కానీ ఇప్పుడు మృతదేహాలను వెలికితీయడానికి అధికారులు, రైల్వే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. దహన సంస్కారాలు చేసే సమయంలో కాలర్‌బోన్‌ను తీసుకొని ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. దీనిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచుతున్నారు.

ఆధారాలు భద్రం..

గుర్తు తెలియని మృతదేహాలకు జీజీహెచ్‌లో మార్చురీకి పంపే ముందు వారి మీద ఉన్న ఆధారాలను పోలీసులు భద్రపరుస్తారు. పుట్టుమచ్చులు, అంగవైకల్యం,ఇతర దెబ్బలకు సంబంధించిన మరకలు, ఎత్తు, రంగు, జుట్టు రంగు, దస్తులను భద్రపరుస్తారు. అంతేకాకుండా షర్టు, పాయింట్‌పై ఉన్న టైలర్ చిరునామాను బట్టి ఎక్కడివారో గుర్తిస్తారు. సెల్‌ఫోన్, పర్సులోని గుర్తింపు కార్డులు, సెల్‌ఫోన్ లోని ఫోన్ నంబర్ వివరాలను సేకరిస్తారు.

హత్య చేసి రైలు పట్టాలపై..

కొందరు హత్య చేసిన తర్వాత మృతదేహాలను రైలు పట్టాలపై పడేస్తున్నారు. ఇది హత్య కాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నిందితులు పట్టాలపై వేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. రైలు పట్టాలపై మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో వారి ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపడతారు. వారిని ఏమాత్రం అనుమానం వచ్చినా దర్యాప్తు చేపడతారు. హత్యగా అనుమానం ఉంటే కేసు నమోదు చేసి ఏ రైలు పట్టాల ప్రాంతం మృతదేహం లభించిందో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తారు.

ఘటన స్థలం ఆధారంగా నిర్ధారిస్తాం

రైల్వే పట్టాలపై శవం ఆధారంగా హత్య.. ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తాం. రెండు రోజుల తర్వాత శవాలను ఖననం చేస్తాం. రైల్వే ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణికులు బోగీ తలుపుల వద్ద ఉంటే ప్రమాదాలు చోటు చేసుకుంటాయి.

–తావూ నాయక్, ఇన్‌చార్జి రైల్వే ఎస్సై, నిజామాబాద్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి తైక్వాండో క్రీడా పోటీల్లో క్యూరియస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు క్రీడల కార్యదర్శి సంగీత్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇందులో ఎనిమిది మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల చివరి వారంలో అండర్–14 కేటగిరీకి నిర్మల్‌లో, అండర్–17 కేటగిరీకి వికారాబాద్‌లో జరగనున్న రాష్ట్ర చాంపియన్‌ షిప్‌లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల శివార్లలో చేతికొచ్చిన మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి చేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట నామమాత్రంగానే ఉంది. ఇదిలా ఉండగా అడవి పందులు, కోతులు దాడి చేసి పంటను ధ్వంసం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

యంచ శివారులో చిరుత సంచారం

నవీపేట: మండలంలోని యంచ శివారులోని విఠలేశ్వర గుట్టపై బుధవారం సాయంత్రం చిరుత కనిపించింది. గ్రామానికి చెందిన యువకులు చిరుత సంచారాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారమిచ్చారు. గత నెల 9న ఇదే గుట్టపై చిరుత సంచరించడంతో అటవీశాఖ అధికారులు బోనును ఏర్పాటు చేసి చిరుతను బంధించి హైదరాబాద్‌లోని జూ పార్క్‌కు తరలించారు. తాజాగా మరో చిరుత సంచరిండంతో గ్రామస్తులు భయపడుతున్నారు. గుట్టపై ఎన్ని చిరుతలు ఉన్నాయో తెలియడం లేదని, అటవీశాఖ అధికారులు బోనును ఏర్పాటు చేయాలని సర్పంచ్ కొట్టాల లహరీ ప్రవీణ్, గ్రామస్తులు ఎమ్మెల్యే, కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు.

ముందస్తు అరెస్టులు



రామారెడ్డి (ఎల్లారెడ్డి): బాన్సువాడ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను బుధవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేసి రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారనే నెపంతో తమను అదుపులోకి తీసుకున్నారని, చేసిన అభివృద్ధి నిజమైతే కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవాల్సిన అవసరం ఏముందని పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రశ్నించారు.

కేటీఆర్ సభకు తరలిన శ్రేణులు



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలో నిర్వహించిన కేటీఆర్ బహిరంగ సభకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. గులాబీ కండువాలు, క్యాప్‌లు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హన్మాజీపేట్, కోనాపూర్, బోర్లం, తాడ్కోల్, ఇబ్రహీంపేట్, దేశాయిపేట్ గ్రామాల నుంచి భారీగా ప్రజలను తరలించారు.

తెయూ సమాచారం..

నూతన దృక్పథాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సువర్ణలక్ష్మి

తెయూ(డిచ్‌పల్లి): ఆధునికయుగంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్ భాష కష్టంగా లేదని, సోషల్ మీడియా ప్రభావం వల్లే గ్లోబల్ లాంగ్వేజెస్ లోకల్ లాంగ్వేజెస్‌గా మారాయని హైదరాబాద్ ఇఫ్లూ ఇంగ్లిష్ విభాగాధిపతి ప్రొఫెసర్ జీ.సువర్ణలక్ష్మి అన్నారు. తెయూ ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల ఇంగ్లిష్ అధ్యాపకులకు బోధనలో మెళకువలు, దృక్పథాలపై ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం హెచ్‌వోడీ పి.సమత, అధ్యాపకులు కేవీ రమణచారి రచించిన 'ప్రొవూస్ ఇన్ ఇంగ్లిష్' అనే పుస్తకాన్ని ఓరియంట్ బ్లాక్‌స్వాన్ పబ్లిషర్స్ అధినేత లలిత్ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెయూ ఇంగ్లిషు హెచ్‌వోడీ పి.సమత, అధ్యాపకులు కేవీ రమణాచారి, జ్యోత్స్న, స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో వివిధ సబ్జెక్టుల్లో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ బుధవారం తెలిపారు. అక్టోబర్ 5న అన్ని సబ్జెక్టుల్లోని రీసెర్చ్ మెథడాలజీ, 6న సంబంధిత ఎంచుకున్న సబ్జెక్టు, 7న రీసెర్చ్ పబ్లికేషన్ ఎథిక్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హెల్త్ సెంటర్ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ హెల్త్ సెంటర్‌లో అవసరమైన మందులు లేని దుస్థితి నెలకొందని వెంటనే సమస్యలను పరిష్కరించాలని వర్సిటీ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని హెల్త్‌సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థులకు వైద్య సేవలు అందించే డాక్టర్ కేవలం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఉంటున్నారని అన్నారు. దీంతో అనారోగ్యానికి గురైన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మహేశ్, అభినయ్, రాజేందర్, సాగర్‌నాయక్, రాము, విజయ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం

- ఏడు గంటల పాటు తహసీల్ కార్యాలయం ముట్టడి
- చెక్కు ఇప్పిస్తానని బాధితులకు ఆర్డీవో హామీ



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

భిక్కనూర్: కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బాధిత కుటుంబ సభ్యులు మండలంలోని తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన భీమయ్య కుమార్తె వివాహం ఇటీవల జరిగింది. గత జూన్ 13న కల్యాణ లక్ష్మి చెక్కు మంజూరైంది. నాటి నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు చెక్కు ఇవ్వడం లేదు. దీంతో భీమయ్య, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్ర 7 గంటల వరకు కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉండడంతోనే చెక్కు మంజూరులో ఆలస్యమవుతోందని అన్నారు. తమ కుటుంబ సభ్యులందరూ బీఆర్ఎస్‌లో చేరితేనే చెక్కు వస్తుందంటూ అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆందోళనకు దిగిన బాధితులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కార్యాలయం ఎదుటే వంటా వార్పు చేపట్టారు. ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి బాధితులకు నచ్చజెప్పారు. ఈ నెల 7వ తేదీ లోగా చెక్కు ఇప్పిస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుండ లింగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు దయాకర్‌రెడ్డి, సిద్ధాగౌడ్, కొండ సిద్ధరాములు, సిద్ధయ్య, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఆత్మహత్య చేసుకోమంటారా..

- బిల్లులు రాక ఆందోళన
- సోషల్ మీడియాలో బీబీపేట ఉపసర్పంచ్ వీడియో వైరల్
- ట్రేస్ చేసి పట్టుకున్న పోలీసులు



మిత్రులతో గోడును విలపిస్తున్న సాయినాథ్

బీబీపేట: సీఎం కేసీఆర్ సార్ గ్రామంలో అభివృద్ధి పనులు చేసి అప్పుల పాలయ్యాను.. బిల్లులు చెల్లిస్తారా లేదా ఆత్మహత్య చేసుకొని చావమంటారా అంటూ బీఆర్ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్ చేసిన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మండలంలోని బీబీపేటకు చెందిన సాయినాథ్ గత ఎన్నికల్లో 13వ వార్డు మెంబర్‌గా గెలిచి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నాటి నుంచి ఉమ్మడి మండలంలో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాడు. సుమారు రూ. 1.50 లక్షల వరకు నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిన సాయినాథ్ వాట్సప్‌లో తన వాయిస్ ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదని, ఎన్నికల కోడ్ వస్తే నిధులు విడుదల కావని పేర్కొన్నారు. తన చావుతో అయినా జీపీ వ్యవస్థను ఆదుకోవాలంటు ఆదుకోవాలంటు వాట్సప్ గ్రూపుల్లో వాయిస్‌మెసేజ్ చేశాడు. దీంతో పోలీసులు సాయినాథ్ నంబర్ ట్రేస్‌చేసి హైదరాబాద్‌లో పట్టుకొన్నారు.

అవకతవకలపై 15 రోజుల్లో రికవరీ చేయాలి



ఎడపల్లిలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఎడపల్లి(బోధన్): అవకతవకలపై 15 రోజుల్లో రికవరీ చేయాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 2022 జనవరి నుండి 2023మార్చి 31 వరకు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌లోని అంశాలను ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. మండలంలోని 17 జీపీలల్లో జరిగిన పనుల వివరాలు, అవకతవకలు, అవినీతి, కూలీలకు డబ్బులు చెల్లించక పోవడం వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ అంశాలను పరిశీలించిన డీఆర్డీవో పనులల్లో జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు ఉపాధి హామీ సిబ్బందికి 15 రోజుల గడువు ఇచ్చారు. అధికారులు, సిబ్బంది సరైన ఆధారాలు సమర్పించకపోతే రికవరీకి ఆదేశిస్తామని హెచ్చరించారు. ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ, సర్పంచ్ ఆకుల మాధవి, జడ్పీటీసీ రజిత, సోషల్ ఆడిట్ అధికారులు, సిబ్బంది, జీపీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఐటీహబ్‌లో ఆందోళన



స్పృహ తప్పిపడిపోయిన ఉద్యోగి

నిజామాబాద్ నాగారం/ నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఐటీహబ్‌లో ఆందోళన నెలకొంది. ఇద్దరు మహిళా ఉద్యోగులు స్పృహ తప్పిపడిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీతాల విషయంలో గొడవ జరగడంతోపాటు తోపులాటలో ఇద్దరు మహిళా ఉద్యోగులు స్పృహ తప్పిపడిపోయినట్లు సమాచారం. బుధవారం జరిగిన ఈ ఘటన ఐటీహబ్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. 45 రోజుల ట్రెనింగ్‌కు సంబంధించి జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు ఇష్టారాజ్యాంగా వ్యవహరించడంతోనే గొడవ తీవ్రతరమైంది.

వీడియోవైరల్

ఐటీ హబ్‌లో గొడవ జరగడంతో ఇద్దరు మహిళా ఉద్యోగులు స్పృహ తప్పి పడిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ విషయమై రూరల్ పోలీసులను సంప్రదించగా గొడవ జరిగినట్లు తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.5లక్షలు మాయం



ఎస్ఎంఎస్‌ను చూపుతున్న బాధిత రైతు

డొంకేశ్వర్(ఆర్మూర్): సైబర్‌మోసానికి ఓ బాధితుడు తన బ్యాంకు ఖాతా నుంచి రూ. 5 లక్షలు పోగొట్టుకున్న ఘటన మండలంలోని నూత్‌పల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పుండ్రు రాజేందర్ అనే రైతు సెల్‌ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ లింక్‌ను క్లిక్ చేయడంతో తన బ్యాంకు నుంచి రూ.5,36,700 మాయం అయ్యాయి. రాజేందర్ యాసంగిలో సాగుచేసి అమ్మిన ధాన్యం డబ్బులు స్థానిక నూత్‌పల్లి యూనియన్ బ్యాంకులో జమ చేశాడు. సెప్టెంబర్ 30న ఆయన స్మార్ట్‌ఫోన్‌కు యూనియన్ బ్యాంకు లోగోతో ఎస్ఎంఎస్ వచ్చింది. బ్యాంకుకు సంబంధించిన మెసేజ్‌లాగా ఉందని క్లిక్ చేశాడు. మరుక్షణమే బ్యాంకు ఖాతా నుంచి ఒక రూపాయి, మళ్లీ రూ.28 డెబిట్ అయ్యాయి. అదే క్షణంలో ఖాతా నుంచి రూ.2లక్షలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసెజ్ వచ్చింది. రాజేందర్ వెంటనే బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు అధికారులు పరీక్షిస్తుండగానే మరో రూ.2లక్షలు, మరోసారి రూ.1లక్ష, ఇంకోసారి రూ.36,700 డెబిట్ అయ్యాయి. మొత్తం నాలుగు సార్లు రూ.5,36,700 సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఇది సైబర్ క్రైం మోసంగా అధికారులు గుర్తించి వెంటనే 1930కు ఫోన్ చేసి రైతుతో ఫిర్యాదు చేయించారు. వెస్ట్ బెంగాల్ ఇచ్చాపురానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు ఈ పని చేసినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తన ఇంటి మరమ్మతుల కోసమని బ్యాంకులో డబ్బులు దాచుకున్నానని, సైబర్ మోసం జరగడంతో ఇంటి పనులు నిలిచిపోయాయని బాధిత రైతు రాజేందర్ వాపోయాడు.

సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన

నూత్‌పల్లిలో సైబర్ మోసం జరగడంతో పోలీసులు స్థానిక యూనియన్ బ్యాంకులో ఖాతాదారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఖాతాదారులు తమ మొబైల్ ఫోన్లకు అపరిచితులు పంపిన ఎస్ఎంఎస్‌లు, వాట్సప్ మెసేజ్‌లు ఓపెన్ చేయకూడదని ఎస్సై రాహుల్ తెలిపారు. మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని వెల్లుట్ల చెరువులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ బుధవారం తెలిపారు. వెల్లుట్ల గ్రామానికి చెందిన కుమ్మరి బాశెట్టి (38) పొలానికి సంబంధించిన పైపులు చెరువులో ఉండడంతో వాటిని తీసేందుకు ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చెరువులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి బాశెట్టి మృతదేహంగా గుర్తించారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన శ్రావణి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మన్‌పల్లికి చెందిన శ్రావణికి జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌తో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఉపాధి నిమిత్తం వీరు తిర్మన్‌పల్లిలో నివాసం ఉంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో లక్ష్మణ్ తాగుడికి బానిస కావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగాయి. మంగళవారం ఉదయం వీరి మధ్య గొడవ జరగగా మనస్తాపానికి గురైన శ్రావణి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జానకంపేట్‌లో కుక్కల వీరంగం



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి రిత్విక్

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలో బుధవారం రిత్విక్ అనే చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కొన్ని రోజుల నుంచి వీధి కుక్కలు పశువులు, చిన్నారులు, గ్రామస్తులపై దాడిచేస్తున్నా జీపీ అధికారులు, సర్పంచ్ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆస్పత్రిలో బాలింత మృతి



చంద్రకళ మృతదేహం

బాన్సువాడ: బాన్సువాడ మండలం కొయ్యగుట్టకు చెందిన చంద్రకళ(24) అనే బాలింతరాలు మంగళవారం రాత్రి మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో మృతి చెందింది. కొయ్యగుట్టకు చెందిన చంద్రకళ పురుటి నొప్పులు రావడంతో ఆస్పత్రిలో చేరింది. రాత్రి వైద్యులు ఆపరేషన్ చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉండడంతో వైద్యులు పర్యవేక్షణ గదిలో ఉంచారు. కొద్ది సేపటికి చంద్రకళకు ఫిట్స్ రావడంతో గమనించిన సిబ్బంది వైద్యులకు సమాచారం అందించారు. వెంటనే వైద్యులు వచ్చి చికిత్స చేస్తుండగా చంద్రకళ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆస్పత్రికి చేరుకుని వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని ఆరోపించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకొని కాంగ్రెస్, బీజేపీ నాయకులను పీఎస్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు



ఘటన స్థలం వద్ద గుమిగూడిన స్థానికులు

మాక్లూర్: కారు అదుపు తప్పి నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి అడవి మామిడిపల్లి శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వెళ్తున్న కారు అడవి మామిడిపల్లి దాటిన తర్వాత మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు కాగా స్థానికులు 108లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని జెండాగల్లికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నగరంలోని గజానన్ రైస్‌మిల్‌లో పనిచేస్తున్న సదరు యువతి మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామస్తుల చేతిలో ఒకరికి దేహశుద్ధి

మాక్లూర్: అహంకారం ప్రదర్శించి చావు దెబ్బలతో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మంగళవారం అర్ధరాతి మండలంలోని ధర్మోరా గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మోరా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరో మహిళ ఇంట్లో ఉండడం గమనించి కుటుంబ సభ్యులు పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు అర్ధరాత్రి కావడంతో గ్రామ శివారులో వదిలేసి ఉదయం పీఎస్‌కు రావాలని సూచించారు. సదరు వ్యక్తి గ్రామంలోకి ప్రవేశించి తనను పోలీసులు వదిలేశారని ఇప్పుడు మీ వంతు చూస్తానంటూ అహంకారం ప్రదర్శించడంతో గ్రామస్తులు కోపంతో దాడి చేశారు. దీంతో సదరు వ్యక్తి ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఎస్సై సుధీర్‌రావును వివరణ కోరగా ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్టాండ్‌లో 15 తులాల బంగారం చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఓ ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారం చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం రాంపూర్‌కు చెందిన శావ్య జిల్లా కేంద్రంలోని తన చిన్నమామ ఇంట్లో శుభకార్యం నిమిత్తం కుటుంబ సభ్యులతో వచ్చింది. బుధవారం రాంపూర్‌కు వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా బస్సు ఎక్కే క్రమంలో దుండగులు బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు ఉన్న కవర్‌ను దొంగిలించారు. దీంతో తాను ఎక్కిన బస్సును గంట పాటు వెతికినా లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి పట్టివేత



పోలీసుల అదుపులో అనుమానితుడు

భిక్కనూర్: తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని జంగంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలో అద్దెకు ఉంటున్న రాజు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి రెండు రోజుల క్రితం వేరే గ్రామానికి వెళ్లాడు. బుధవారం వేకువజామున ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి వచ్చి ఇకరు ఇంట్లోకి ప్రవేశించగా మరొకరు బైక్‌వద్ద ఉన్నారు. ఇంట్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని హైదరాబాద్‌కు చెందినవాడిగా గుర్తించారు. విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.